# ముసలి కన్నీరు

వసంతకుమార్ సూరిశెట్టి



ఆకాశానికంటుకుంటున్న చితి మంటల్లో కవిత శరీరం కాలి బూడిదై పోయింది. పద్దెనిమిదేళ్ళకు పెళ్ళి చేసుకుని, ఇరవై సంవత్సరాలకే ఇద్దరి పిల్లలకి తల్లి అయి, ఇరవై మూడేళ్లకే మృత్యువు ఒడిలోకి చేరుకుంది.

రాజారాం చితిముందు తడిసిన బట్టల్తో, కవిత ఇచ్చి వెళ్ళిన జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ శిలలా నిలబడి వున్నాడు. గుండెల్లోంచి దుఃఖం పొంగుకు రాగా కళ్లల్లోంచి నీళ్ళు ధారగా ప్రవహించ సాగాయి.

"రాజా...!"

భుజంమీద పడిన చేతి స్పర్శతో ఈ లోకంలోకి వచ్చాడు రాజారాం.

"పోదాం పద"

అందరితో ఇంటి దారి పట్టాడు. శ్మశానం నిశ్శబ్దంగా ఒక లేత హృదయాన్ని తనలో కలిపేసుకుంది. ఇంటికి వెళ్లేవరకూ ఎవరూ ఎవరితోనూ మాట్లాడుకోలేదు. అందరిలోనూ అదే శ్మశాన నిశ్శబ్దం.

రాజారాం ఇంట్లో కాలు పెట్టగానే రవి, కిరణ్ లిద్దరూ పరుగెత్తుకుని వచ్చి రాజారాం చేతుల్ని పట్టుకున్నారు. ఇద్దరిదీ జరిగిన అనర్థం తెలుసుకునే వయసు కాదు.

"అమ్మ ఎక్కడ డాడీ?".

"దేవుడి దగ్గరకి వెళ్ళింది బాబూ".

"ఎప్పుడు వస్తుంది?"

"కొద్ది రోజుల్లోనే వచ్చేస్తుంది బాబు"

మళ్లీ కవిత జ్ఞాపకాలు గుర్తుకు రావడంతో భోరున ఏడవసాగాడు రాజారాం. ఎవరో వచ్చి పిల్లల్నిద్దర్నీ రాజారాం దగ్గర్నించి తీసుకుని వెళ్ళిపోయారు.

"రాజా...." తండ్రి పరంధామయ్య గొంతు.

"వెళ్ళి తలకి స్నానం చేసి, బట్టలు మార్చుకుని వచ్చి కొంచెం ఎంగిలిపడు. నిన్నట్నించీ ఏమీ తినలేదు."

"వద్దు నాన్నగారు... ఆకలి లేదు."

"నువ్విలా కడుపు మాడ్చుకుంటే పోయిన వాళ్లు వస్తారా చెప్పు".

"నాకు కవిత అంటే ఎంత ఇష్టమో మీకు తెలీదా నాన్నగారు. తను లేకుండా నేను బతకలేను."

"ఏం చేద్దాం చెప్పు. మనకి రాసి పెట్టింది అంతే! పిల్లల కోసమైనా నువ్వు ధైర్యంగా వుండాలి కదా! పోను పోనూ అన్నీ సర్దుకుంటాయి."

నిజమే మూడు నెలలు అయేసరికి అందరూ నెమ్మనెమ్మదిగా కవితను, ఆమె జ్ఞాపకాలను మరిచిపోసాగారు. రెండో పెళ్ళి గురించిన మాటలు వినిపించసాగాయి ఆ యింట్లో.

"ఏమిటి నాన్నగారు మీరు చెప్పేది?"

"అవున్రా.. నిన్న కవిత నాన్నగారొచ్చారు. ఆయన చెప్పిందీ నాకు సబబుగానే తోచింది."

"కవిత చనిపోయి ఇంకా మూడు నెలలు కూడా కాలేదు. అప్పుడే ఈ మాటలేంటి నాన్నగారు?"

"దానిదేముందిరా. సరిగ్గా చూసుకునే వాళ్లు లేక పిల్లలు ఎలా పాడైపోయారో చూసావా?"

"నాకెందుకో కవిత స్థానంలో ఇంకొకర్ని చూడ బుద్ధి కావడం లేదు నాన్నగారు."



"సరే ఆలోచించి మంచి నిర్ణయానికి వస్తావనుకుంటాను" అంటూ పరంధామయ్య వెళ్ళిపోయారు.

రెండు నెలల తర్వాత......

పిల్లలు నిద్రపోయారు. అంతసేపూ వారిని జోకొడుతున్న హరిత నెమ్మదిగా పైకి లేచింది. అమ్మ ఇచ్చిన పాలగ్లాసుని చేత్తో పట్టుకుని తెల్లని పట్టుచీర రెపరెపలాడుతూవుంటే నెమ్మదిగా తలుపు తెరుచుకుని శోభనపు గదిలోనికి ప్రవేశించింది.

"రా హరిత" ప్రేమగా పిలిచాడు రాజారాం.

పాలగ్లాసుని టేబుల్ మీద పెట్టి కాళ్ళకి నమస్కరించిన హరితను పైకి లేపి పక్కన కూర్చోబెట్టుకున్నాడు రాజారాం.

కొన్ని క్షణాలు మౌనం.

"మళ్లీ అడుగుతున్నానని ఏమనుకోకు. నీవు నిజంగా ఇష్టపడే ఈ పెళ్లికి సమ్మతించావా హరి".

"మీకు ఇష్టం లేదా బావా?"

"నా సంతోషం ముఖ్యం కాదు హరితా. పిల్లలిద్దరికీ తల్లి ప్రేమ కావాలి. వాళ్ల కోసమే నేను ఈ పెళ్లికి సరే అన్నానుగానీ, లేకపోతే కవిత జ్ఞాపకాలతోటే బ్రతికేవాడ్ని తెలుసా?"

"అబద్ధం... అంతా బూటకం...." గట్టిగా అరిచి మళ్లీ చెప్పసాగింది హరిత.

"అక్క అనాకారిగా వున్నా డబ్బులకాశపడి పెళ్ళి చేసుకున్నారు. నేను వయసుకొచ్చిన తర్వాత నన్ను ఎలాగయినా మీ వల్లో పడేటట్లు చెయ్యడానికి ఎన్నో ప్రయత్నాలు చేసారు. అవి ఏవీ జరక్కపోయేసరికి నామీద కోపం అక్కమీద చూపించి ఆమెని చిత్రహింసలు పెట్టేవారు. ఇంట్లో అందరి ముందూ అక్క మీద బోల్డెంత ప్రేమ వున్నట్లుగా నటించేవారు."

"హరితా! మతి వుండే మాట్లాడుతున్నావా?" గట్టిగా అరిచాడు రాజారాం.

"కోపగించుకోకండి బావగారు. అక్క కరెంటు షాకు వల్ల చనిపోయిందన్నారు. నాకెందుకో అక్కే కావాలని షాకు తగిలేటట్లు చేసుకుని ఆత్మహత్య చేసుకుందేమోననిపిస్తుంది. ఎందుకంటే అక్క చనిపోవడానికి రెండు రోజుల ముందు నా దగ్గరకు వచ్చింది. మీరు పెట్టే బాధల గురించి ఒక్కటి వదలకుండా అంతా చెప్పింది. ఒకవేళ తను ఛనిపోతే పిల్లలు అనాధలైపోతారని అలాకాకుండా నన్ను మిమ్మల్ని పెళ్లి చేసుకోమని చెప్పి నా దగ్గర ఒట్టేయించుకుంది. మీరు ఎదురు చూసినట్టే అక్క మీ బాధల్ని భరించలేక చనిపోయింది. అక్కపోయిన తర్వాత నన్ను పెళ్లి చేసుకోవాలన్నదే మీ వుద్దేశం. నేను నాన్నగారితో చెప్పి పంపించకపోయినా కొన్నాళ్ల తర్వాత మీరెలాగూ ఈ ప్రపోజల్ని మా వాళ్ల దగ్గర తీసుకుని వచ్చేవారు. కాదంటారా? అయినా ఏమీ తెలియనట్లు కవితక్కకోసమే బతుకుతున్నట్లు, పిల్లల కోసమే పెళ్లి చేసుకున్నట్టు ఎంత చక్కగా నటిస్తున్నారు.

కానీ ఇప్పుడు నా నిర్ణయం చెబుతున్నాను వినండి. పిల్లలకి నేను తల్లిగా వుండడానికే మిమ్మల్ని పెళ్లి చేసుకున్నానుగానీ, మీకు మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ పెళ్లాంగా మాత్రం వుండబోను. మీ చెయ్యి కూడా నా మీద పడకూడదు. ఒకవేళ బలవంతం చేసారో మిమ్మల్ని చంపి నేను ఛస్తాను" అంటూ దిండూ, దుప్పటి తీసుకుని ప్రక్క గదిలోకి వెళ్లిపోయింది హరిత ఆది పరాశక్తిలా. ❋